శబరిమలలో పిల్లలకు ప్రత్యేక దర్శనం

క్యూలో వేచి ఉండనక్కర్లేదు

పతనంతిట్ట: కేరళలోని శబరిమల ఆలయంలో సౌకర్యాల లేమిపై వస్తున్న విమర్శలపై ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు స్పందించింది. చిన్న పిల్లలు సులభంగా అయ్యప్ప స్వామి దర్శనం చేసుకునేందుకు ఆదివారం ప్రత్యేక గేటు వ్యవస్థ ఏర్పాటు చేసింది. క్యూలు, భక్తుల రద్దీతో సంబంధం లేకుండా పిల్లలు ముందు వరుసలో దర్శనం చేసుకునేందుకు వీలుగా ఈ వ్యవస్థను ప్రవేశపెట్టినట్టు టీడీబీ తెలిపింది. పిల్లలు, మహిళలు, దివ్యాంగులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపింది. త్వరలోనే ఉచిత వైఫై సౌకర్యం కల్పిస్తామని వెల్లడించింది.

నాగ్‌పూర్‌లో భారీ పేలుడు.. 9 మంది మృతి

ముంబై, డిసెంబర్17(నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో నాగ్‌పూర్‌లోని ఓ ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 9 మంది చనిపోయారు. ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. నాగ్‌పూర్‌లోని బజార్‌గావ్ గ్రామంలో సోలార్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో ఆదివారం ఉదయం ఈ పేలుడు సంభవించింది. పేలుడు పదార్థాలను ప్యాకింగ్ చేసే పని జరుగుతుండగా పేలుడు సంభవించినట్లు సమాచారం.

గ్రామీణుల కోసం ప్రత్యేక పాలసీ

2047నాటికి అందరికీ బీమా: ఎల్ఐసీ

న్యూఢిల్లీ: 2047 నాటికి 'అందరికీ బీమా' లక్ష్యాన్ని సాధించడంలో ఎల్ఐసీ కీలక పాత్ర పోషిస్తుందని ఆ సంస్థ చైర్మన్ సిద్ధార్థ మొహంతి చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ప్రత్యేక పాలసీలు తీసుకురానున్నట్టు తెలిపారు. తమ వ్యాపారంలో గ్రామీణ ప్రాంతాల వాటా రానున్న రోజుల్లో పెరుగుతుందన్నారు. 'బీమా విస్తార్' బీమా ప్రొడక్ట్‌ను ఐఆర్‌డీఏఐ ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ ప్రొడక్ట్‌లను అత్యధికంగా మహిళలను నియమించనున్నట్లు తెలిపారు.

వేగంగా బెయిల్ పిటిషన్ల పరిష్కారం

హైకోర్టులకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ: బెయిల్ దరఖాస్తులు స్వేచ్ఛకు సంబంధించినవని, వాటిపై హైకోర్టులు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఒక కేసు నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం తాజాగా ఈ వ్యాఖ్యలు చేసింది. నిందితుడి పిటిషన్‌ను విచారణకు లిస్టింగ్ చేయాలని బెంచ్ ఈ సందర్భంగా హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులో పిటిషన్ విచారణ తేదీని వెల్లడించలేదని పేర్కొన్నది.

పూజారిని కాల్చి చంపి.. కళ్లు పీకేసి

బిహార్‌లో దారుణం

గోపాల్‌గంజ్: ఒక పూజారిని కాల్చి చంపడమే కాక, అతని కనుగుడ్లు పీకేసిన దారుణ ఘటన బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లా దానాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం 32 ఏండ్ల మనోజ్ కుమార్ అనే పూజారి గత సోమవారం నుంచి కన్పించకుండా పోవడంతో కుటుంబసభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారు. పొదల్లో పడి ఉన్న అతని మృతదేహాన్ని శనివారం సాయంత్రం కనుగొన్నారు. అతడికి కాల్చి చంపడమే కాక, నేత్రాలు పీకేశారు. అతని ప్రైవేట్ భాగాలపై గాయాలున్నట్టు పోలీసులు తెలిపారు.

నిద్రలేమితో క్యాన్సర్ ముప్పు

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: నిద్రలేమితో బాధపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నది. ఈ రుగ్మత అంత ప్రమాదకారి కాదని భావిస్తూ వస్తున్నారు. కానీ సుదీర్ఘకాలంగా నిద్రలేమితో సతమతమైతే క్యాన్సర్ బారిన పడటం ఖాయమని, బుద్ధిమాంద్యం, పార్కిన్సన్స్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తాజా అధ్యయనం హెచ్చరించింది. గతకొన్నేండ్లుగా రొమ్ము, తల, మెడ, కిడ్నీ, గాల్‌బ్లాడర్‌కు సంబంధించి క్యాన్సర్ కేసులు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి. దీనికి నిద్రలేమికి సంబంధముందని సైంటిస్టులు భావిస్తున్నారు. చీకటిపడగానే మెదడు నుంచి మెలటోనిన్ అనే హార్మోన్ విడుదలవుతుంది. రాత్రంతా మేల్కొని పనిచేయటం వల్ల హార్మోన్ విడుదల కాదు. దీంతో శరీరం క్యాన్సర్ ముప్పున పడే అవకాశం ఎక్కువని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుదీర్ఘకాలం నిద్రలేమి వల్ల.. శరీరంలో జీవ గడియారం గతి తప్పుతుందని, దాంతో కొన్ని అవయవాల్లో క్యాన్సర్ తలెత్తుతున్నదని నిపుణులు అంచనావేశారు.

సౌర తుఫానులతో రైలు ప్రమాదాలు!

లండన్, డిసెంబర్ 17: అంతరిక్షంలో మార్పులు, ముఖ్యంగా సౌర తుఫానులు భూమిపై రైలు ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఇంగ్లండ్ పరిశోధకులు కనుగొన్నారు. బలమైన సౌర తుఫానులతో భూ అయస్కాంత శక్తిలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని, రైల్వే సిగ్నలింగ్‌లో రెడ్ సిగ్నల్‌కు బదులు గ్రీన్ సిగ్నల్, గ్రీన్ సిగ్నల్‌కు బదులు రెడ్ సిగ్నల్‌కు మారుతున్నాయని పరిశోధకులు తేల్చారు. ఇది రైలు ప్రమాదాలకు దారితీస్తున్నదని లాంకాస్టర్ వర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. భూమిపై విద్యుత్తు సరఫరాలో ఆటంకాలు కూడా ఏర్పడుతున్నాయని తేల్చారు. 'కొన్ని దశాబ్దాలకొకసారి అంతరిక్ష వాతావరణంలో మార్పులు సంభవిస్తాయి. శతాబ్దంలో ఒకటి, రెండు సార్లు ఇవి తీవ్రంగా ఉంటాయి. ఇవి భూమిపై రైల్వే భద్రత, సిగ్నల్ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి' అని పరిశోధకుడు ప్యాటర్సన్ అన్నారు.

10 వేల ఏండ్లు నడిచే గడియారం

వాషింగ్టన్, డిసెంబర్ 17: పదివేల సంవత్సరాలు నడిచే 500 అడుగుల భారీ గడియారాన్ని నిర్మించేందుకు ప్రముఖ ఈ-కామర్స్ కంపెనీ 'అమెజాన్' వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 42 మిలియన్ డాలర్లు (రూ.350 కోట్లు) కేటాయించారు. కంప్యూటర్ సైంటిస్టు, ఇన్వెంటర్ డానీ హిల్స్ ఆలోచనలోంచి పుట్టిన ఈ ప్రాజెక్ట్ 'ద క్లాక్ ఆఫ్ ద లాంగ్ నౌ'. ఏడాదికి ఒకమారు 'టిక్' అంటూ శబ్దం చేస్తుంది. ఈ 'యాంత్రిక గడియారాన్ని' లాంగ్ న్యూఫౌండేషన్ అనే సంస్థ టెక్సాస్ కొండలపై ఏర్పాటుచేయనున్నది. ఒక గది పరిమాణంలో ఉండే ఐదు ఛాంబర్‌లు ఈ గడియారంలో ఉంటాయి. మొదటి ఏడాది-మొదటి ఛాంబర్, 10వ ఏడాది-రెండో ఛాంబర్, 100వ ఏడాది-మూడో ఛాంబర్, 1000వ ఏడాది-నాలుగో ఛాంబర్, 10వేల సంవత్సరం-ఐదో ఛాంబర్‌కు కేటాయించారు. ఆయా కాలాల్లో మానవ చరిత్రని తెలిపే కళాఖండాలు, సందేశాలు.. తదితర అంశాల్ని ఇందులో పొందుపరుస్తారు.

కొత్త ఏడాదిలోనూ కోతలేనా?

- భారీగా ఉద్యోగ కోతలుంటాయని అంచనా
- గత రెండేండ్లలో లక్షలాది ఉద్యోగులకు ఉద్వాసన
- 2024లో అమెరికాలోనే లక్షల్లో తొలగింపులు
- అమెరికా కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ వెల్లడి
- భారత్‌లోనూ కోతలే ఉంటాయని అంచనా
- ఉద్యోగులను భారీగా తగ్గిస్తున్న స్టార్టప్ కంపెనీలు
- రెండేండ్లలో ఇండియాలో 35 వేల మందిపై వేటు

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: కొలువుల కోత కొనసాగుతూనే ఉన్నది. అన్ని రంగాల్లో వీలైనంత ఎక్కువ మంది ఉద్యోగులను వదిలించుకొనేందుకు కంపెనీలు పోటీ పడుతున్నాయి. రెండేండ్ల క్రితం వరకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆశాదీపంగా కనిపించిన స్టార్టప్ కంపెనీలు.. ఆర్థికమాంద్యం భయాలతో కుదేలై ఉద్యోగులను కనికరం లేకుండా బయటకు గెంటేస్తున్నాయి. భారత్‌లో గత రెండేండ్లలో స్టార్టప్ కంపెనీలే 35 వేల మంది ఉద్యోగులను తొలగించాయని లెక్కలు చెప్తున్నాయి. వచ్చే ఏడాది మరిన్ని ఉద్యోగ కోతలుంటాయని పలు సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఒక్క అమెరికాలోనే లక్షల్లో ఉద్యోగ కోతలుంటాయని ఆ దేశ కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీవో) అంచనా వేసింది. దీంతో కొత్త సంవత్సరం కోతలతోనే మొదలవుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

వేలమంది ఇంటికే

భారత్‌లో 2022లో కేవలం స్టార్టప్ కంపెనీలే దాదాపు 18 వేలమంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. 2023లోనైనా పరిస్థితి మెరుగవుతుందని భావించారు. కానీ, ఈ ఏడాది ఇప్పటికే 17 వేల మందికిపై ఉద్యోగులను స్టార్టప్ కంపెనీలు కొలువుల నుంచి తొలగించాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంతో మరోసారి ప్రపంచంలో ఆర్థిక మాంద్యం తప్పదన్న భయాలతో 2022లో స్టార్టప్ కంపెనీలు భారీగా ఉద్యోగులను వదిలించుకొన్నాయి. 2023లో కూడా ఆ ప్రభావం కనిపించటంతో ఉద్యోగ కోతలు ఆగలేదు. మరో 5 వేల మంది వరకు అనధికారికంగా తొలగించబడినట్టు సమాచారం. బైజుస్, ఓలా, అన్‌అకాడెమీ, బ్లింకిట్, వైట్‌హ్యాట్ జూనియర్ సంస్థలు 14 వేలమందిని తొలగించాయి. ఒక్క బైజుస్‌లోనే 6,500 మంది ఉద్యోగాలు కోల్పోయారు.

కొత్త ఏడాదిలో పరిస్థితేంటి?

కొత్త ఏడాదిలోనైనా ఉద్యోగాల కోతలు ఆగుతాయా? కొత్త ఉద్యోగాల సృష్టి ఏమైనా జరుగుతుందా? అని నిరుద్యోగులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు. పరిస్థితులు మాత్రం ఉద్యోగాల కోతలనే సూచిస్తున్నాయని పలు సంస్థలు అంటున్నాయి. 2024లో ఒక్క అమెరికాలోనే లక్షల్లో ఉద్యోగాలు ఊడిపోవచ్చని సీబీవో అంచనా వేసింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఇంకా కొనసాగుతుండటం, కొత్తగా ఇజ్రాయెల్-గాజా యుద్ధం నేపథ్యంలో ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు ఇప్పట్లో కుదుటపడే అవకాశాలు కనిపించటంలేదు. మరోవైపు అన్ని రంగాల్లోకి కృత్రిమ మేధ సాంకేతికత దూసుకొస్తున్నది. ఈ నేపథ్యంలో పోయిన ఉద్యోగాలను మళ్లీ భర్తీ చేసే అవకాశాలు తక్కువగానే ఉంటాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్థికమందగమనం తొలగకపోతే 2024లోనూ ఉద్యోగ కోతలను భారీగానే చూడాల్సి వస్తుందని నిపుణులు చెప్తున్నారు. ఉద్యోగుల కోతపై రిజ్యూమ్‌బిల్డర్స్ డాట్‌కామ్ సంస్థ నిర్వహించిన సర్వేలో మూడు అంశాలు వెల్లడయ్యాయి. 906 కంపెనీలను ఈ సంస్థ సర్వే చేయగా, 2024లో తమ కంపెనీల్లో ఉద్యోగాల తొలగింపు ఉంటుందని 65 శాతంమంది కంపెనీల యజమానులు తెలిపారు. 50 శాతం మంది కొత్త ఏడాదిలో కొత్త ఉద్యోగులను నియమించుకోవటంలేదని చెప్పారు. 70 శాతం మంది ఏఐ టెక్నాలజీ వల్లనే ఉద్యోగులను తొలగిస్తున్నామని తెలిపారు. మరోవైపు ఉద్యోగులను తొలగించకుండా ఖర్చులను తగ్గించుకొనేందుకు కంపెనీలు కొత్త మార్గాలను వెదుకుతున్నట్టు తేలింది. ఉద్యోగులను అదనపు సౌకర్యాలు, బోనస్‌లు, బెనిఫిట్స్‌ను తీసేయటం వంటివి ఇందులో ఉన్నాయి.

2023లో లక్షన్నర ఉద్యోగాలు ఊస్ట్

ప్రపంచవ్యాప్తంగా 2023లో గూగుల్, ట్విట్టర్ (ఎక్స్), అమెజాన్ వంటి సంస్థలు వేల మంది ఉద్యోగులను తొలగించాయి. ట్విట్టర్‌ను మస్క్ కొన్న తర్వాత ఒక్కసారే సంస్థలోని 80 శాతం మందిని ఉద్యోగాల నుంచి పీకేశారు. గూగుల్ ఒక్కసారే 15000 మందిని తొలగించింది. ఇలా 2023లో 1,65,000 మంది ఉద్యోగులు నిరుద్యోగులయ్యారని అంచనా. తాజాగా అమెరికాకు చెందిన ఈ-కామర్స్ కంపెనీ 'బోల్ట్' 29 శాతం మంది తొలగిస్తామని ప్రకటించింది.

తమిళనాడును ముంచెత్తిన వానలు

మిగ్‌జాం తుఫాన్ విలయం నుంచి ఇంకా కోలుకోకముందే తమిళనాడును మళ్లీ భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఆదివారం దక్షిణ తమిళనాడును వర్షాలు ముంచెత్తాయి. కన్యాకుమారిలో వరదనీటిలో మునిగిపోయిన ఓ ప్రాంతం నుంచి చిన్నారులను రక్షిస్తున్న సహాయ సిబ్బంది.

24లోగా మరాఠా రిజర్వేషన్లు కల్పించాలి

జరాంగే అల్టిమేటం

ముంబై, డిసెంబర్ 17: ఈ నెల 24వ తేదీలోగా మరాఠా రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమ నేత జరాంగే పాటిల్ మహారాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. గంట కూడా అదనపు సమయం ఇవ్వబోమని స్పష్టంచేశారు. మరాఠా రిజర్వేషన్ల డిమాండ్‌కు నాయకత్వం వహిస్తున్న బృందంతో జాల్నా జిల్లా అంతర్వాలి సారథి గ్రామంలో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇన్నాళ్లు ప్రభుత్వం ఏమి చేసిందని, ఇంకా ఎందుకు సమయం ఇవ్వాలని ప్రశ్నించారు. తక్షణమే మరాఠా ప్రజలకు రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు.

శాంతిని ధ్వంసం చేస్తున్న గవర్నర్

కేరళ సీఎం విజయన్ ఆరోపణ

పతనంతిట్ట, డిసెంబర్ 17: గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టే ప్రకటనలతో రాష్ట్రంలో శాంతిని ధ్వంసం చేస్తున్నారని కేరళ సీఎం పినరాయి విజయన్ విమర్శించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థులను క్రిమినల్స్ అని గవర్నర్ విమర్శించడాన్ని ఖండించారు. ఖాన్ తాను గవర్నర్‌ను అన్న మాట మరిచి ఏది పడితే అది మాట్లాడుతున్నారని, తన చర్యలతో రాష్ట్రంలోని శాంతికి భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. నిరసనకారులను క్రిమినల్స్, గూండాలు అని పేర్కొనడం ఎంతవరకు సబబని విజయన్ ప్రశ్నించారు.

వచ్చే ఏడాది జనవరిలో అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం జరుగనున్న నేపథ్యంలో ఆదివారం అమెరికాలోని వాషింగ్టన్‌లో కార్ల ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ అమెరికన్లు

గాజాలో 4 కి.మీ. టన్నెల్

గుర్తించిన ఇజ్రాయెల్ సైన్యం

జెరూసలేం, డిసెంబర్ 17: గాజాలో హమాస్ ఉగ్రవాదులు ఏర్పాటుచేసుకున్న అతిపెద్ద రహస్య సొరంగాన్ని ఇజ్రాయెల్ సైన్యం గుర్తించింది. నాలుగు కిలోమీటర్ల పొడవున్న ఈ సొరంగం, గాజాలో 'ఎరెజ్' చెక్‌పోస్ట్‌కు సమీపంలో ఉందని ఇజ్రాయెల్ ఆదివారం పేర్కొన్నది. సొరంగంలో డ్రైనేజ్ వ్యవస్థలు, విద్యుత్ సరఫరా, వెంటిలేషన్, మురుగునీరు, కమ్యునికేషన్ నెట్‌వర్క్‌తోపాటు, పట్టాలు ఉండటం గమనార్హం. లక్షల డాలర్లు ఖర్చు చేసి నిర్మించిన ఈ సొరంగాల్లో హమాస్ పెద్ద ఎత్తున ఆయుధాల్ని దాచిపెట్టిందని, వీటిలో దాక్కుంటూ ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రదాడులకు పాల్పడుతున్నదని ఇజ్రాయెల్ ఆరోపిస్తున్నది.

నిర్లక్ష్యం వల్లే టన్నెల్ విపత్తు!

- చార్‌ధామ్ ప్రాజెక్టులో ప్రమాదాలపై ముందే నిపుణుల హెచ్చరికలు
- కేంద్రం పట్టించుకోలేదని ఆరోపణలు
- ఫలితంగానే టన్నెల్ ప్రమాద ఘటన

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన టన్నెల్ కూలిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయిన విషయం తెలిసిందే. ఆ కూలిన టన్నెల్‌లో 41 మంది కార్మికులు చిక్కుకుపోవడం.. వారికి కాపాడేందుకు 17 రోజుల పాటు రెస్క్యూ ఆపరేషన్ సాగింది. అయితే ఈ టన్నెల్ ఘటనపై పలు అనుమానాలు, విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 2016లో ఈ ఛార్‌దామ్ ప్రాజెక్టును ప్రారంభానికి ముందే సాంకేతిక నిపుణులు, భూగర్భ పరిశోధకులు జరుగబోయే ప్రమాదాల గురించి హెచ్చరించినా కేంద్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రాజెక్టు విషయంలో జరిగిన పలు రివ్యూ మీటింగుల్లో భూగర్భ పరిశోధకులు దీనిపై పదేపదే హెచ్చరికలు చేసినా, వారి మాటను పెడచెవిన పెట్టారని ప్రముఖ వెబ్‌సైట్ సైన్స్.ఓఆర్‌జీ పేర్కొన్నది. రోడ్డు నిర్మాణంలో భాగంగా కొండలను తొలచడం, సొరంగాలు నిర్మించే ప్రక్రియలో కొండచరియలు విరిగి పడతాయని, వరదలు సంభవిస్తాయని హెచ్చరించారని తన కథనంలో పేర్కొన్నది. ఇటీవల జరిగిన టన్నెల్ ఘటన నేపథ్యంలో ఇప్పటికైనా చార్‌ధామ్ ప్రాజెక్టు నిర్మాణ పనులను పునఃపరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇలాంటి విపత్తులు మళ్లీ పునరావృతం కాకుండా నిర్మాణ ప్రణాళికలను పరిశీలించటానికి, నివారణ చర్యలు తీసుకొనేలా న్యాయ వ్యవస్థ కేంద్ర ప్రభుత్వానికి అవసరమైన ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీకి చెందిన పర్యావరణ శాస్త్రవేత్త అంజల్ ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. ఈ రోడ్డు నిర్మాణ కార్యకలాపాల సమయంలో పలు చోట్ల ఇప్పటికే ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోయారని పేర్కొంటూ వెబ్‌సైట్ పలు ఘటనలను ఉదహరించింది. హిమాలయ రీజియన్‌లో అశాస్త్రీయ అభివృద్ధి పనులను జరుగనివ్వబోమని, సొరంగం కూలిన ఘటనపై ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరవాలని ప్రముఖ పర్యావరణ ఉద్యమకారిణి, న్యాయవాది మల్లికా భానోత్ డిమాండ్ చేశారు.

జ్ఞానవాపిపై మరో పిటిషన్

'నంది' పేరుతో దాఖలు

శివాలయ పునరుద్ధరణకు అనుమతివ్వాలని విజ్ఞప్తి

అయోధ్య, డిసెంబర్ 17: అయోధ్యలో కాశీ విశ్వనాథుని ఆలయానికి ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదుపై శివుని నంది పేరుతో కొత్త పిటిషన్ దాఖలైంది. మసీదు కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న అసలు శివాలయాన్ని పునరుద్ధరించడానికి న్యాయస్థానం అనుమతి ఇవ్వాలని కోరుతూ నంది మహరాజ్ తన భక్తుల ద్వారా వారణాసి జిల్లా కోర్టులో కేసు దాఖలు చేసింది. ముస్లింలు చట్ట విరుద్ధంగా నిర్మించిన మసీదు కట్టడాన్ని తొలగించి, వాస్తవానికి అదే స్థలంలో కొలువై ఉన్న శివుని ఆలయ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరింది.

మేలో అయోధ్య మసీదు నిర్మాణం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో మసీదు నిర్మాణం వచ్చే ఏడాది మే నెల నుంచి ప్రారంభమవుతుంది. దీని కోసం నిధులను సేకరించేందుకు ఫిబ్రవరి నుంచి రాష్ట్రాలకు ఇన్‌ఛార్జిలను నియమించాలని ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిర్ణయించింది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ధన్నీపూర్‌లో మసీదుకు స్థలాన్ని కేటాయించింది. ట్రస్టు చీఫ్ ట్రస్టీ జాఫర్ ఫరూఖీ మాట్లాడుతూ, వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నాటికి మసీదు ఫైనల్ డిజైన్ ఖరారయ్యే అవకాశం ఉందని, వచ్చేమే నుంచి మసీదు నిర్మాణాన్ని ప్రారంభించే అవకాశం ఉందని చెప్పారు. గతంలో 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మసీదును నిర్మించాలనుకున్నామని, ఇప్పుడు దీనిని 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణానికి పెంచామని తెలిపారు.



సూరత్‌లో నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయ భవన సముదాయం

పార్లమెంట్ ఘటన తీవ్రమైనదే

రాద్ధాంతం అనవసరం..తొలిసారి స్పందించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ/సూరత్, డిసెంబర్ 17: పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన ఘటనపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. ఇది తీవ్రమైన అంశమేనని పేర్కొన్న ఆయన దీనిపై రాద్ధాంతం అనవసరమని ప్రతిపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ఘటన ఆందోళనకరమని, తక్కువ అంచనా వేయకూడదని అన్నారు. హిందీ పత్రిక దైనిక్ భాస్కర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఘటనపై దర్యాప్తు సంస్థలు విచారణ చేస్తున్నాయని పేర్కొన్నారు. దీని వెనుక ఉన్నవారి మూలాలు, వారి ఉద్దేశాన్ని తేల్చాలని అన్నారు.

సూరత్ డైమండ్ బోర్స్ భవనాన్ని ప్రారంభించిన మోదీ

గుజరాత్‌లో ఆదివారం పర్యటించిన ప్రధాని మోదీ సూరత్‌లో నిర్మించిన సూరత్ డైమండ్ బోర్స్(ఎస్‌డీబీ) భవనాన్ని ప్రారంభించారు. వజ్రాల వ్యాపార కార్యాకలాపాలకు ఉద్దేశించిన ఈ బిల్డింగ్ ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయ సముదాయంగా నిలిచింది. ఈ కాంప్లెక్స్‌ను దాదాపు 67 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు.

సోషల్‌మీడియా వాడకం తగ్గిస్తే మానసిక ఆరోగ్యం

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: సోషల్‌మీడియా వాడకం ఎంత తగ్గిస్తే.. మానసిక ఆరోగ్యానికి, చేస్తున్న ఉద్యోగానికి అంత మంచిదని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. సోషల్‌మీడియా వాడకం 30 నిమిషాలు తగ్గించుకుంటే ఉద్యోగంలో పనిపై ఏకాగ్రత పెరుగుతుందని, వృత్తిలో సంతృప్తి దక్కుతుందని పరిశోధకులు పేర్కొన్నారు. జర్మన్ సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్, రూర్ వర్సిటీకి చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనంలోని అంశాల్ని 'బిహేవియర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' జర్నల్ తాజాగా ప్రచురించింది. దీని ప్రకారం, 166 మందిని ఎంపిక చేసుకొని.. వారిని రెండు గ్రూపులుగా పరిశోధకులు విడగొట్టారు. ఒక గ్రూప్ సోషల్‌మీడియా వాడకాన్ని 30 నిమిషాలు తగ్గించుకోగా, మరోగ్రూప్ తన సోషల్‌మీడియా హాబీని యథావిధిగా కొనసాగించింది. పరిశోధనకు ముందు.. తర్వాత వారి నుంచి వివిధ ప్రశ్నలపై సమాధానాలు సేకరించారు. సోషల్‌మీడియా వాడకం 30 నిమిషాలు తగ్గించుకున్న గ్రూప్‌లోనివారు.. తమ మానసిక ఆరోగ్యం మెరుగుపడిందని, ఉద్యోగంలో సంతృప్తి ఉందని చెప్పారు.

6% వృద్ధి ఉన్నా పేద దేశమే

- 2047 నాటికి దిగువ మధ్య దేశంగానే భారత్
- విమర్శ సైద్ధాంతికంగా ఉండాలి.. వ్యక్తిగతంగా కాదు
- రిజర్వ్‌బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

హైదరాబాద్/న్యూఢిల్లీ, డిసెంబర్ 17: భారతదేశం ప్రస్తుతం సాధిస్తున్న 6 శాతం ఆర్థిక వృద్ధితో 2047 నాటికి కూడా దిగవ మధ్య ఆదాయ దేశంగానే ఉంటుందని రిజర్వ్‌బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. 6 శాతం వృద్ధి తక్కువేమీ కాదని, అయినా ఈ వృద్ధితో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగలేదని చెప్పారు. 2047 నాటికి ఇప్పుడున్నంత జనాభా ఉన్నా.. ఈ ఆర్థిక వృద్ధితో మధ్య ఆదాయ దేశంగానే ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో మంథన్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడారు. 'గత రెండు త్రైమాసికాల్లో భారత వృద్ధిరేటు 7.5 శాతం. కార్మికుల భాగస్వామ్యం పరంగా, ముఖ్యంగా మహిళా లేబర్ పార్టిసిపేషన్ పరంగా చూస్తే ఇది చాలా తక్కువ. జీ20 దేశాల్లో భారత్‌దే తక్కువ వృద్ధిరేటు. ప్రస్తుతం భారతదేశ వార్షిక అత్యధిక వృద్ధిరేటు 6 శాతం. అంటే ప్రతి 12 ఏండ్లకు, 24 ఏండ్లకు ఇది డబుల్ అవుతుంది. తలసరి ఆదాయం నాలుగింతలు పెరుగుతుంది. ప్రస్తుతం భారత్‌లో తలసరి ఆదాయం 2,500 డాలర్లు మాత్రమే. దీనిని నాలుగుతో గుణిస్తే 10 వేల డాలర్లు అవుతుంది. అంటే మరో 24 ఏండ్ల తర్వాత (2047) కూడా మనది పేద దేశంగానే ఉంటుంది' అని వివరించారు.

విమర్శ సైద్ధాంతికంగా ఉండాలి

వ్యక్తుల మధ్య విమర్శలు సైద్ధాంతికంగా ఉండాలే కాని.. వ్యక్తిగతంగా ఉండకూడదని రఘురామ్‌రాజన్ అన్నారు. ఆయన రచించిన 'బ్రేకింగ్ ది మోల్డ్: రిమైనింగ్ ఇండియాస్ ఎకనమిక్ ఫ్యూచర్' పుస్తక ప్రచారంలో భాగంగా వార్తాసంస్థ పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. 'ఎవరినైనా వ్యక్తిగతంగా విమర్శించటం సరికాదు. ఇతరుల ఉద్దేశాలను ప్రశ్నించవద్దు. దేశద్రోహి వంటి మాటలు వాడటం సరికాదు. నేను విశ్వగురువును.. నాకే అంతా తెలుసు అనుకోవటం మూర్ఖత్వం' అని పేర్కొన్నారు.

4 లక్ష్యాల ఛేదన ఒకేసారి

మొదటిపేజీ తరువాయి...

జరిగిన అస్త్రశక్తి-2023 విన్యాసాల సందర్భంగా ప్రదర్శించారు. ఒకే ఫైరింగ్‌తో నాలుగు లక్ష్యాలపై గురిపెట్టగల క్షిపణి వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రదర్శించిన ప్రపంచంలోని మొదటి దేశంగా భారత్ నిలిచింది